మెదక్ జిల్లాకు కొత్త లెక్చరర్లు

52 మంది అధ్యాపకుల కేటాయింపు

కాలేజీల్లో తీరనున్న బోధన తిప్పలు 7

31 పాఠశాలల్లో 'ఏఐ' 8

సంగారెడ్డి జిల్లాలో రేపటి నుంచి అమలు



మంబోజిపల్లిలోని నిజాం షుగర్స్ పరిశ్రమ

తీపి కబురు!

నిజాంషుగర్స్ పునరుద్ధరణపై ముందడుగు

మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ సమావేశం

ఫ్యాక్టరీ నడపడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ

వచ్చే నెల మరోసారి సమావేశం

చిగురించిన రైతుల ఆశలు

నిజాం షుగర్స్‌కు మంచి రోజులు వస్తాయా.. మళ్లీ పొలాల్లో చెరుకు పంటను చూస్తామా.. అని మెతుకుసీమ రైతులు ఆశపడుతున్నారు. దశాబ్దాలుగా నిజాం షుగర్ పరిశ్రమను పునరుద్ధరిస్తామని ప్రభుత్వాలు చెప్పడమే తప్ప అడుగు ముందుకుపడలేదు. తెలంగాణ వస్తే మహర్దశ వస్తుందనుకుంటే మొదటికే ఎసరు రావడంతో రైతులు ఉసూరుమన్నారు. చెరుకు పంటకే దూరమయ్యారు. వరి, ఇతర పంటలు ఎన్ని ఉన్నా.. పెద్ద పంటగా పేరున్న చెరుకు వేస్తే దరిద్రం తొలగిపోతుందని రైతులు నమ్ముతారు. కానీ, స్థానికంగా చక్కెర కర్మాగారం లేక పంటను సాగుచేసే ధైర్యం చేయడం లేదు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిజాం షుగర్స్‌ను తెరిపిస్తే మరోసారి ఉమ్మడి జిల్లాలో చెరుకు పంట విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది. వందలాది మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కూలీలు ఉపాధి పొందుతారు.

మెదక్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిజాం షుగర్స్ పునరుద్ధరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగు ముందుకు వేసింది. పది మంది సభ్యులతో వేసిన ఉన్నతస్థాయి కమిటీ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత తాజాగా సమావేశమైంది. జిల్లాకు చెందిన మంత్రి దామోదర్ రాజనర్సింహ కమిటీకి కో-చైర్మన్‌గా, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ బుధవారం హైదరాబాద్‌లో సమావేశమై నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడానికి విధివిధానాల రూపకల్పన కోసం చర్చలు జరిపారు. గత సంవత్సరం నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేటలో ఉన్న ఎన్‌డీఎస్ఎల్ పరిశ్రమలను సందర్శించిన కమిటీ సభ్యులు సమయాభావంతో మెదక్ మంజోజిపల్లి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీకి రాలేదు. పరిశ్రమలను తిరిగి తెరిచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి, నివేదికను తయారు చేసే బాధ్యతను ఓ పేరున్న ప్రైవేటు సంస్థకు అప్పగించినట్లు సమాచారం. ఆ సంస్థ ప్రతినిధులు మూడు యూనిట్లను పరిశీలించి నివేదికను ఇవ్వడంతో ఉన్నతస్థాయి కమిటీ మారోసారి సమావేశమైంది. నివేదికలో పేర్కొన్న అంశాలపై చర్చించింది. ఈమేరకు పాత యంత్రాలకు మరమ్మతులు జరిపించి పునరుద్ధరించడమా.. కొత్త యంత్రాలను కొనుగోలు చేయడమా అని కమిటీ చర్చించినట్లు తెలిసింది. యంత్రాలకయ్యే ఖర్చు, ఫ్యాక్టరీ పరిసరాల్లో 10 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు, డిస్టిలరీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకున్న అవకాశాలపై చర్చించినట్లు సమాచారం. త్వరలోనే మరోసారి సమావేశమై కూలంకశంగా చర్చించాలని నిర్ణయించినట్లు తెలిసింది. పాత యంత్రాలకు మరమ్మతులు చేయడానికి

మిగతా 8వ పేజీలో..

హెచ్‌ఎండీఏలోకి మరిన్ని మండలాలు

- కొత్తగా చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట..
- మెదక్ జిల్లాలో మాసాయిపేట..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

మెదక్ అర్బన్/పుల్‌కల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిని విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 68ను జారీ చేసింది. ఇప్పటికే సంగారెడ్డి జిల్లాలోని 8 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. కొత్తగా చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట మండలాలను చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల సంఖ్య 11కు చేరింది. అలాగే, మెదక్ జిల్లా పరిధిలో మాసాయిపేట మండల కేంద్రం, కొప్పులపల్లి హెచ్‌ఎండీఏలో చేరాయి. ఇప్పటికే మెదక్ జిల్లాలోని నర్సాపూర్, శివ్వంపేట, హత్నూర(నర్సాపూర్ నియోజకవర్గం), తూప్రాన్, మనోరాబాద్ మండలాలు ఉండగా.. కొత్త మసాయిపేట మండలం చేరడంతో ఆరు మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వెళ్లాయి.

'రియల్' జోరు

చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట మండలాల్లోని వివిధ గ్రామాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం చేపట్టనుండటంతో అందుకనుగుణంగా హెచ్‌ఎండీఏ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. దీంతో, ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకోనున్నది. ఇప్పటికే జిల్లా మీదుగా సంగారెడ్డి-నాందేడ్, అకోలా ఎన్‌హెచ్ 161, ఎన్‌హెచ్ 65 ఉన్నాయి. ఈ హైవేలతో పాటు ఆర్ఆర్ఆర్ చుట్టూ కూడా పెద్ద ఎత్తున రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరందుకోనుంది.



చౌటకూర్ తహసీల్దారు కార్యాలయం

రంజాన్ వేళలు

శుక్రవారం ఇఫ్తార్: సాయంత్రం 6.31

శనివారం సహర్: ఉదయం 5.02



సంగారెడ్డిలో కామదహనం

రంగుల పండుగ.. హోలీ

- రసాయన రంగులతో అనారోగ్య సమస్యలు
- సహజ సిద్ధమైనవే వాడాలంటున్న నిపుణులు

7

వసంత ఆగమనం సందర్భంగా జరుపుకునే హోలీ పండుగ వచ్చింది. రంగుల సంబరం తెచ్చింది. గురువారం రాత్రి కామదహనం జరుపుకున్న ప్రజలు నేడు రంగులు చల్లుకోవడానికి సిద్ధమయ్యారు. హోలీకి ఇంట్లోనే మోదుగ పూలు, ఆకులతో తయారు చేసిన సహజ రంగుల్ని వాడటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

నెరవేరనున్న సొంతింటి కల

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

కొండాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సొంతింటి కల నెరవేరనున్నదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కొండాపూర్ మండల కేంద్రంలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. దశల వారీగా నిర్మాణానికి నిధులు మంజూరవుతాయని తెలిపారు. కేజీబీవీ బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. కేజీబీవీలో బాలికల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చేతి రాతతో రాస్తూ చదువుకోవాలని సూచించారు. చదువు, యోగా, మెడిటేషన్, కృత్రిమ మేథా(ఏఐ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్)పై కలెక్టర్ ప్రశ్నలు అడగగా సరైనా సమాధానాలు చెప్పిన విద్యార్థులను ప్రశంసించారు. వసతి గృహంలో కిచెన్ షెడ్, స్టోర్‌రూమ్, డైనింగ్‌హాల్, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులుకు నూతన మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతుందని, విద్యార్థులు ఏకగ్రతతో చదువుకోవాలని పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ చలపతిరావు, ఏఈ మాధవరెడ్డి, తహసీల్దార్ అనిత, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ ప్రదీప్, ఆర్ఐ మహదేవ్, కొండాపూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, పాఠశాల, వసతి గృహాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


పోలంపల్లి బిడ్డ.. మరువబోదు ఈ గడ్డ

నేడు సంస్మరణ దినం

రజాకార్ల గుండెల్లో మోగిన రణభేరి.. అనభేరి

నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రభాకర్‌రావు దళం పోరుబాట

మహ్మదాపూర్ గుట్టల్లో అసువులు బాసిన 12 మంది వీరులు



హుస్నాబాద్ బస్‌డిపో చౌరస్తాలోని అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం

హుస్నాబాద్ రూరల్, మార్చి 13 : పోలంపల్లి పులిబిడ్డ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేద ప్రజల విముక్తి కోసం సాయుధ పోరాటాం నడిపి అసువులు బాసిన అమరుడు అనభేరి ప్రభాకర్‌రావు. రజాకార్ల దాడిలో నేలకొరిగిన అమరుల సంస్మరణ దినం నేడు.

నేటికి 77 ఏళ్లు..

ప్రభాకర్‌రావు జన్మస్థలం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామం. జమీందార్ కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్‌రావు గ్రామాల్లో జరుగుతున్న పెత్తాందార్ల దోపిడీ, అరాచకత్వాలు, బానిస విధానాలకు వ్యతిరేకంగా పోరుబాట పట్టాడు. ప్రజా సైన్యంతో వాడవాడలా ఎర్రజెండాలు ఎగరవేస్తూ పోరాటం సాగిస్తున్న దశలో 14 మార్చి 1948న ప్రభాకర్ దళం మహ్మదాపూర్‌కు చేరుకున్నది. గ్రామస్థులతో సమావేశమైన అనంతరం మాందాపురం శివారులోని గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటుండగా రజాకార్లు చుట్టిముట్టి దళంపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ఎదురొడ్డి పోరాటం సల్పిన ప్రభాకర్‌రావు దళం చివరకు నేలకొరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డితో పాటు, మరో పది మంది దళ సభ్యులు ముస్కు చొక్కారెడ్డి, ఎలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, గుండి దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెట్టి రాంరెడ్డి, నల్లగొండ రాజారం, చిక్కుడు సాయిలు, రోండ్ల మాదవరెడ్డి హతమయ్యారు. మహ్మదాపూర్ గుట్టల ఎన్‌కౌంటర్‌లో అమరులైన 12 మంది అమరవీరుల స్మారకార్థం స్థూపాలు నిర్మించారు. ఈ సంఘటన జరిగి నేటికి 77 సంవత్సరాలు గడుస్తోంది.



మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి, సింగిరెడ్డి స్మారక చిహ్నాలు

పిట్టల వెంకన్న 41వ వర్ధంతి

ప్రభాకర్‌రావు ఆశయ సాధనకు ఆయన బాటలో నడిచిన వ్యక్తి, కమ్యూనిస్టు పోరాట యోధుడు మహ్మదాపూర్ గ్రామానికి చెందిన పిట్టల వెంకన్న. 30 సంవత్సరాలుగా ఏకగ్రీవ సర్పంచ్‌గా బాధ్యత చేపట్టి గ్రామాన్ని ఏకతాటిపై నడిపించారు. 1985 మార్చి 14న అనభేరి సంస్మరణ సభను ముగించుకుని ఓ పెళ్లికి హాజరై సేద తీరుతున్న వెంకన్నను కొందరు దుండగులు చుట్టుముట్టి హతమార్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● హోలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
● మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం ప్రకటనలో తెలిపారు. హోలీ సంబురాలను ప్రజలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. సంప్రదాయ పద్ధతుల్లో, చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించని ప్రకృతిలో లభించే సహజ రంగులను వినియోగించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలను నడపడం, బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్ల చల్లడం వంటివి చేయకూడదని సూచించారు. బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఆ వ్యక్తులపై చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలను తరచూ గమనిస్తూ వారికి సరైన మార్గాలను నిర్దేశించాలని తెలిపారు. యువత వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ లాంటివి మానుకోవాలని సూచించారు. హోలీ సందర్భంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రదేశాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ హోలీ మీ జీవితాలలో రంగులు నింపాలని కోరుకుంటూ సిబ్బందికి, సంగారెడ్డి జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎస్పీ పరితోష్ పంకజ్

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య

జగదేవ్‌పూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిగడప గ్రామానికి చెందిన నర్ర బాలేశం నాగలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నర్ర ప్రవళిక(13) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం గ్రామానికి చేరుకున్నది. తల్లి నాగలక్ష్మి ఇంటి ఎదుట దుస్తులను ఉతుకుతుండగా ప్రవళిక కడుపునొప్పి వస్తుందని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నది. ఇంటి బయట ఉన్న తల్లి నాగలక్ష్మి ప్రవళికను ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. ఫ్యాన్‌కు వేళాడుతున్న ప్రవళికను చూసి తల్లి నాగలక్ష్మి బోరున విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి కిందికి దించారు. వెంటనే అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దుండిగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా దుద్దెడ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(20), ప్రవీణ్‌కుమార్(20) స్నేహితులు. వీరిద్దరు ఉపాధి కోసం నగర శివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మల్లంపేటకు వలస వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. అయితే గురువారం ఇద్దరు కలిసి సొంత పనులపై ద్విచక్రవాహనంపై ఉదయం 11:30 గంటలకు వెళ్తున్నారు. మంజు వైన్స్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు 108 సహాయంతో ఇద్దరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ గురువారం సాయంత్రం మృతిచెందాడు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ సంఘటన జరిగిన ప్రాంతం నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సాగు కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

సంగారెడ్డి టౌన్, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సాగు చేస్తూ పట్టుబడిన ఓ వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా అడిషనల్ సేషన్ కోర్టు న్యాయాధికారి తీర్పునిచ్చారు. సదాశివపేట మండలం తంగెడ్‌పల్లి గ్రామానికి చెందిన నాగులపల్లి వీరన్న 2020లో గంజాయిని సాగు చేస్తూ పట్టుబడగా సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ మధుబాబు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి కె.జయంతి పూర్వపారాలు పరిశీలించి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధించారు. అప్పటి ఎక్సైజ్ సీఐ జె. మధుబాబును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి.కమలాహాసన్‌రెడ్డితో పాటు డిప్యూటీ కమిషనర్లు హరికిషన్, కేఏబీ శాస్త్రీలు అభినందించారు.

భవానీమాత విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● రంజోల్‌లో హిందూ సంఘాల ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

జహీరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : రంజోల్‌లోని భవానీమాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను పట్టుకుని, కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో హిందూ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు గురువారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజోల్‌లోని భవానీమాత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విగ్రహాన్ని ధ్వంసం చేసి, ఆలయం బయట పడవేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అమ్మవారి మెడలో ఉన్న పుస్తెలు, కాళ్ల మెట్టెలను దొంగలించారని ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శివలింగం పోలీసులతో రంజోల్‌కు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో చేరుకుని ఆందోళనకారులను శాంతించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

● 12 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి సామగ్రి స్వాధీనం
● మెదక్ కోర్టులో హాజరు పరిచిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ రేణుకారెడ్డి, పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

పెద్దశంకరంపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం పెద్దశంకరంపేటలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి, సొత్తు రికవరీ చేసినట్లు సీఐ రేణుకారెడ్డి తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. సీఐ వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ ఈనెల 11న తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి కర్ణాటకలోని ఘానగాపూర్‌కు వెళ్లారు. 12వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో పని చేసే ఆసిన్ బేగం వారి ఇంటికి వచ్చింది. బెడ్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఉండడంతో వెంటనే శ్రీనివాస్ గౌడ్‌కు తెలియజేశారు. అతని తమ్ముడు గంగాధర్‌గౌడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెడ్‌రూమ్ లాకర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబందించిన ఆరు తులాల బంగారు గొలుసు, ఐదు తులాల బంగారు పుస్తక దండం, తులానికి పైగా పుస్తే, మెట్టెలు, రెండు కేజీల వెండి ఆభరణాలు, రూ.6 వేల నగదు దొంగలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా దొంగలను పట్టుకున్నారు. పెద్దశంకరంపేట గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజుగౌడ్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసులు 12 తులాల బంగారు ఆభరణాలు, దాదాపు రెండు కిలోల వెండి వస్తువులు, 6000 నగదును రికవరీ చేసి, నిందితుడిని మెదక్ కోర్టులో హాజరు పర్చారు. ఈ సమావేశంలో ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మూడు రోజుల్లోనే దొంగతనం కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ



వృద్ధురాలిని విచారిస్తున్న సీఐ, ఎస్ఐ

తూప్రాన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఉదయం ఇంటిముంగిట ముగ్గేసి పక్కనే ఉన్న కిరాణ దుకాణం వద్దకు వెళుతున్న వృద్ధురాలి మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన తూప్రాన్ పట్టణంలో గురువారం ఉదయం చోటుచేసుకున్నది. ప్రత్యక్షసాక్షులు, బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణం ఎల్లమ్మ కమాన్ వద్ద నివాసం ఉండే కొత్తకొండ రామారావు తల్లి కొత్తకొండ రంగమ్మ(80) ఉదయం 7 గంటలకు ఇంటి ముంగిట ముగ్గేసింది. అనంతరం పక్కనే ఉండే కిరాణ దుకాణం వద్దకు వచ్చి చూడగా బందు చేసి ఉంది. అప్పుడే బైక్‌పై వచ్చి ఆగిన గుర్తుతెలియని ఓ యువకుడిని కామదహనం రాత్రి జరిగిందా? అంటూ రంగమ్మ ప్రశ్నించగా, తెలుగు రాదంటూ చెప్పాడు. అటు ఇటు చూసి రంగమ్మ మెడలో ఉన్న ఆరు తులాల బంగారు గొలుసును బలంగా లాగాడు. గొలుసు తెగిపోయి, మెడకు గాయమైంది. వృద్ధురాలు కేకలు వేయగా, దొంగ అక్కడి నుంచి బైక్‌పై పారిపోయే ప్రయత్నం చేశారు. పారిపోతుండగా బైక్ కింద పడటంతో అక్కడే వదిలి పారిపోయాడు. నంబరు ప్లేట్ లేకుండా ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.



రంగుల పండుగ.. హోలీ

● రసాయన రంగులతో అనారోగ్య సమస్యలు.. ● సహజ సిద్ధమైనవే వాడాలంటున్న నిపుణులు

దౌల్తాబాద్/కొండపాక/మెదక్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులు, యువత ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న రంగుల పండుగ రానే వచ్చింది. హోలీలో వాడే రంగుల తరహాలోనే ప్రతీ ఒక్కరి జీవితం రంగుల మయం కావాలని అందరూ కోరుకుంటుంటారు. కానీ, రంగుల పండుగ మాటున ప్రమాదం పొంచి ఉందని, రసాయన రంగుల వినియోగంతో చర్మ వ్యాధులు, దృష్టి లోపాలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హోలీ ఆడేటప్పుడు విధిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వీలైనంత వరకు రసాయన రంగులు వాడకపోవడమే ఉత్తమమని, ప్రత్యామ్నాయంగా సహజ సిద్ధ రంగులు(హెన్నా, పసుపు, కుంకుమ, చందనం, బుక్క గులాలు, మోదుగు పూలు, టమాట గింజలతో తయారు చేసినవి) వాడాలని సూచిస్తున్నారు. హానికరమైన రంగులతో శరీరంపై దురద, మంట రావడంతోపాటు పొడి రంగు గాలిలో కలిసిపోయి నోరు, ముక్కు ద్వారా ఊపిరితిత్తుల్లో చేరి ఆస్తమా, ఎలర్జీ ఇతర ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హోలీ స్పెషల్.. పిడిగుద్దులాట

శివ్వంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ అంటేనే ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోవడం. కానీ మెదక్ జిల్లా శివంపేట మండలం కొంతాన్‌పల్లిలో పిడిగుద్దులాట జరుపుకోవడమే హోలీ స్పెషల్. ఏటా గ్రామంలో హోలీ వేడుకల్లో భాగంగా దీన్ని నిర్వహిస్తారు. గురువారం గ్రామంలో నిర్వహించిన పిడిగుద్దులాట జాతరను తలపించింది. పిడిగుద్దులాట నిర్వహించకుంటే గ్రామంలో ఏదైనా అరిష్టం జరుగుతుందేమోనని గ్రామస్థుల నమ్మకం. పురుషులు మాత్రమే పాల్గొనే ఈ కార్యక్రమంలో కొందరికి గాయాలు కూడా అవుతుంటాయి.



నీటి వృథాను అరికట్టాలి

రంగుల్లో అపరిశుభ్రమైన నీటిని కలిపి చల్లుకోవడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. పట్టణాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైన తరుణంలో హోలీ పేరిట నీటిని వృథా చేయకూడదని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. హోలీ ఆడిన తరువాత స్నానానికి చెరువులు, కుంటలకు వెళ్లే యువత జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఈత రాకుంటే చెరువులోకి దిగకపోవడం ఉత్తమమని, జలాశయల వద్ద పోలీస్‌లు భద్రత ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



రంగులు చల్లుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు, హోలీ ఆడే సమయంలో తల్లిదండ్రులు దగ్గరుండి చూసుకోవాలి. ముఖ్యంగా కండ్లలో, గొంతులో, చెవులలో రంగు పోకుండా చూసుకోవాలి. కండ్లకు అద్దాలు తలకు టోపీ ధరించాలి. ఒకవేళ కళ్లలో రంగు పడితే వెంటనే శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వైద్యులను సంప్రదించాలి.

-కిరణ్ రెడ్డి, మెదక్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

ఇలా చేద్దాం..

- రసాయన రంగులను వాడాల్సి వస్తే అవి శరీరంపై ఎక్కువ సేపు ఉండకుండా చూసుకోవాలి.
- ఎరుపు, పింకు కలరు రంగులు వాడితే మంచిది. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండడంతో శరీరంపై నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఆరెంజ్, పసుపు రంగులు అధిక మోతాదులో రసాయనాలు కలిగి ఉంటాయి. ఇవి శరీరంపై నుంచి తొలగించడం కష్టం
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి, జుట్టుకు నూనే రాసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. సులభంగా శుభ్రం చేసుకోవచ్చు.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా షాంపో వాడటం మంచిది.
- రంగులకు పలు రకాల ఆయిల్ కలిపి శరీరానికి రాస్తుంటారు. ఇలా చేయడం వల్ల వాటిని శుభ్రం చేయడం కష్టం. ఎక్కువ నీటిని వినియోగించాల్సి ఉంటుంది.
- రంగునీళ్లు, పొడి కళ్లల్లో పడకుండా కంటి అద్దాలు వాడాలి
- కోడి గుడ్ల ద్రావణాన్ని రంగుల్లో కలపకూడదు
- శరీరంపై గాయాలుంటే బ్యాండెజ్ వేసుకోవాలి.
- ముఖంపై దద్దుర్లు, తామర వంటివి ఉంటే మొదట సంబంధిత ఆయింట్మెంట్, తరువాత నూనెను రాయాలి.
- మొదట సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసాక, నూనె రాసుకోవాలి.
- బాలికలు, మహిళలు తమ చేతివేళ్లకు దట్టంగా నెయిల్ పాలిష్‌ను వేసుకోవాలి.
- రంగుల వల్ల అలెర్జీ అనిపించిన చోట, నీటితో కడిగాక ఐస్‌తో మర్దన లేదా పెరుగు రాయడం వంటివి చేయాలి. అలోవెరా జెల్ కూడా రాయొచ్చు.
- రంగు పూర్తిగా తొలగకపోతే అలోవెరా జెల్ లేదా పెరుగుతోనే శుభ్రం చేయాలే కానీ, బ్లీచ్ చేయించుకునేందుకు బ్యూటీ పార్లర్‌కు వెళ్లకూడదు.
- రంగుల్లో ఉండే రసాయనాలు, చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించవచ్చు. అందువల్ల హోలీ ఆడిన వెంటనే బ్యూటీపార్లర్‌కు వెళ్లకూడదు. కనీసం ఐదు రోజులైనా వ్యవధి ఇవ్వాలి.
- అన్నింటికన్నా ముఖ్యంగా హోలీ వేడుకలో పాల్గొనేముందు తగినన్ని నీళ్ల తాగాలి.

మొన్న కామ దహనం.. నేడు హోలీనా.!?



రామాయంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడైనా కామ దహనం జరిగిన మరుసటి రోజు హోలీ జరపటం ఆనవాయితీ. కానీ.. మొట్టమొదటిసారిగా మెదక్ జిల్లా రామాయంపేటలో ఇందుకు భిన్నంగా జరిగింది. గురువారం హోలీ అని భావించిన పట్టణ ప్రజలు బుధవారం రాత్రి కామ దహనం నిర్వహించారు. పండుగ నేపథ్యంలో గురువారం వ్యాపారులు దుకాణాలు సైతం తెరువాలేదు. కానీ ఏ ఒక్కరూ రంగులు చల్లుకోవడానికి ముందుకు రాలేదు. కాగా, శుక్రవారం రామాయంపేటలో హోలీ పండుగ జరుపుకోనున్నట్లు తేటతెల్లమైంది. దీంతో ప్రజలు ఔరా.. ఇదే చోద్యం.. అంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● ఏటీఎస్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్

పటాన్‌చెరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఇంజినీర్లు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆస్ట్రియాలోని ఏటీఅండ్‌ఎస్ ఏజీలో అప్లికేషన్ ఇంజినీరింగ్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ మొక్కపాటి సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నిక్స్' పై గురువారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. టూడీ, త్రీడీ, అభివృద్ధి చెందుతున్న ఫోర్ డీ ప్యాకేజింగ్‌తో సహా సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నాలజీలలో తాజా పురోగతుల గురించి విద్యార్థులతో పంచుకున్నారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, కార్యక్రమ నిర్వాహకుడు ప్రొఫెసర్ ఎం.ప్రశాంత రెడ్డి అతిథిని సత్కరించారు. అదేవిధంగా దుర్గం చెరువు వద్ద గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ చార్ కోల్ వర్క్‌షాప్ నిర్వహించింది. 'బ్లాంక్ కాన్వాస్ నుంచి మాస్టర్ పీస్ వరకు' అనే ఇతివృత్తంతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో బాలల నుంచి వయోజనుల వరకు, అన్ని వయస్సుల వారు పాల్గొని సృజనాత్మకతకు పదును పెట్టారు.

విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేస్తాం

● టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



కార్యక్రమంలో వినియోగదారులు, అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జోన్‌లో విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. మేడ్చల్ జోన్‌లోని హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్లలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను గురువారం ఆయన సమీక్షించారు. సర్కిళ్ల పర్యటనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన పీటీఆర్, ఫీడర్లను వినియోగదారుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ మేడ్చల్ జోన్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను అంచనా వేసి దానికి తగ్గట్టు విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. గత వేసవిలో మేడ్చల్, బౌరంపేట్, అమీన్ పూర్, బాచుపల్లి, ప్రగతి నగర్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, మియాపూర్, పఠాన్‌చెరు, మయూరి నగర్ వంటి ప్రాంతాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో సాంకేతిక సర్వే చేసి భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లలో అదనంగా 62 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, 1081 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను, 243, 11 కేవీ ఫీడర్లను, 37, 33 కేవీ ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేడ్చల్ జోన్ పరిధిలో 15 నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కమర్షియల్ డైరెక్టర్ సాయిబాబా, మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ కామేష్, సూపరింటెండింగ్ ఇంజినీర్లు బ్రహ్మం, రవికుమార్, శ్రీనాథ్, డివిజనల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలకు కొత్త లెక్చరర్లు

● జిల్లాకు 52 మంది అధ్యాపకుల కేటాయింపు

● తీరనున్న బోధన తిప్పలు

మెదక్ అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కొత్త అధ్యాపకులు వచ్చారు. 13 ఏళ్లుగా పూర్తి స్థాయిలో లెక్చరర్లు లేక కాలేజీల్లో బోధన అంతంత మాత్రంగా సాగుతోంది. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త అధ్యాపకులు నియామక పత్రాలు అందుకున్నారు. మెదక్ జిల్లాకు 52 మంది లెక్చరర్లను కేటాయించారు. వారు త్వరలోనే విధుల్లో చేరనున్నారు.

పదోన్నతులలోనే సరి..

ఏళ్ల తరబడి సర్కార్ లెక్చరర్ల నియామకాలను చేపట్టలేదు. అయితే 2014, 2016, 2019, 2021లో పదోన్నతులు కల్పించారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసింది. వీరితోపాటు కొందరు కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లతో బోధన సాగుతోంది. దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కొత్త నియామకాలు చేపట్టడంతో జిల్లాకు 52 మంది కొత్త అధ్యాపకులు రానున్నారు. దాంతో లెక్చరర్ల కొరత తీరనుంది.

జిల్లాలో ఇలా...

మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా.. దాదాపు 6 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం రెగ్యులర్ లెక్చరర్లు 129 మంది, గెస్ట్ 68, కాంట్రాక్టు 10, తాత్కాలిక 3 మంది పని చేస్తున్నారు. జిల్లాలో 68 పోస్టులు ఖాళీలు ఉండగా.. కొత్తగా 52 మంది అధ్యాపకులు రానున్నారు.

పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి

● రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్ రాజగోపాల్ రావు



పరిశ్రమలో మొక్కలు నాటుతున్న రాజగోపాల్ రావు

మనోహరాబాద్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో కార్మికుల కోసం భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ రాజగోపాల్ రావు అన్నారు. భద్రతతో కూడిన జీవన విధానం అలవర్చుకుని వికసిత్ భారత్ లక్ష్యం వైపు ప్రయాణం చేయాలని సూచించారు. గురువారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 54 వ జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయనతోపాటు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ లక్ష్మీకుమారి హాజరయ్యారు. అనంతరం రాజగోపాల్ రావు మాట్లాడుతూ పరిశ్రమలు భద్రతతో కూడిన ఉత్పత్తిని విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి సాధించడంపై పరిశ్రమలు దృష్టి పెట్టాలన్నారు. కార్మికులు ప్రమాదాలు బారి పడకుండా పరిశ్రమలు నడిపించాలని అన్నారు. ఎమ్మెస్ అగర్వాల్ 54 వ జాతీయ భద్రత వారోత్సరాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం పరిశ్రమ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు వసంత్ కుమార్, చక్రవర్తి, నరసింహం, పీఆర్‌ఏఈ వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

చేర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో గురువారం నిర్వహించతలపెట్టిన సీల్డ్‌టెండర్ కమ్ బహిరంగ వేలం అనివార్య కారణాల వలన వాయిదా వేశారు. ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల సెల్‌ఫోన్ భద్ర పరిచడానికి, షాపింగ్ కాంప్లెక్స్ లీజ్, ప్రసాద కౌంటర్ పక్కన పూజా సామాగ్రి విక్రయానికి లైసెన్స్ జారీకోసం టెండర్ల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువరచడంతో పలువురు షెడ్యూల్స్ దాఖలు చేశారు. గురువారం టెండర్ల నిర్వహణను వాయిదా వేశామని, వచ్చే మంగళవారం టెండర్లు జరుపుతామని ఈవో రామాంజనేయులు తెలిపారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

మెదక్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని మిర్జిపల్లి తండాకు చెందిన మహిళ 108 అంబులెన్స్‌లో గురువారం ఉదయం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తండాకు చెందిన స్వప్న పురిటినొప్పులతో బాధపడుతున్నది. వైద్య సిబ్బంది ఆమెను 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువయ్యాయి. మార్గమధ్యలో సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, రమేష్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. పండంటి మగబిడ్డకు జన్మనివ్వడంతో తల్లి, బిడ్డను మెదక్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.

విద్యార్థినుల పోషకాహారానికి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తోడ్పాటు

● రూ.9.5 లక్షల విలువైన ఎంవోయూపై సంతకాలు



ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్

కంది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఎద్దుమైలారం వద్ద ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉమ్మడి మెదక్ జిల్లాలోని పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యం సంరక్షించడానికి, పోషకాహారానికి తోడ్పాటు అందించనున్నది. ఈ మేరకు గురువారం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ సందర్భంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు రూ.9.5 లక్షల విలువైన ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాల విద్యార్థినుల పోషకాహారాన్ని మెరుగుపరచడం కోసం కృషి చేస్తున్నట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్ పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ఏవీఎన్‌ఎల్ ద్వారా సేవా కార్యక్రమాల ప్రయత్నాల్లో మరొక మైలురాయిని సూచిస్తుందని తెలిపారు.

క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకుల్లో ఐఐటీహెచ్ సత్తా

● ఆరు సబ్జెక్టులలో ఉత్తమ స్థానాలు

కంది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ పాఠ్యాంశాల బోధనలో తన సత్తా చాటి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల సరసన నిలిచింది. బోధనలో ఏకంగా ప్రపంచంలోని టాప్ వర్సిటీల జాబితాలో చేరింది. ఐఐటీహెచ్‌లో ఉన్న పాఠ్యాంశాల ర్యాంకులను మెరుగుపర్చుకోవడంతో పాటు మరో 6 పాఠ్యాంశాల ర్యాంకులను యథాతథంగా కాపాడుకోగలిగింది. ప్రపంచ వ్యాప్తంగా 1700 విశ్వవిద్యాలయాల్లో 55 రకాల పాఠ్యాంశాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ ఎడిషన్‌ను రూపొందించారు. ఈ విశ్లేషణాత్మక అధ్యయనంలో ఐఐటీహెచ్ విశేష ప్రతిభను ప్రదర్శించింది. అంతర్జాతీయ విద్యావిశ్లేషకుడు క్యాక్వారెల్లి సైమండ్స్ గురువారం ఈ జాబితాను విడుదల చేశారు. క్యూఎస్ వరల్డ్ వర్సిటీ సంస్థ ప్రకటించిన ర్యాంకుల్లో ఆరు సబ్జెక్టులకు ప్రకటించిన జాబితాలో ఐఐటీ హైదరాబాద్ చోటు దక్కించుకుంది. మెకానికల్-ఏరోనాటికల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్, ఫిజిక్స్‌అస్ట్రోనమీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ-మెటీరియల్స్‌సైన్స్ సబ్జెక్టులు ర్యాంకుల జాబితాలో ఉత్తమ స్థానాలు సాధించాయి. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం మొదటిసారిగా 501-550 మధ్య ర్యాంకు పొందడం విశేషం. విద్య, పరిశోధన నైపుణ్యాలకు ఐఐటీహెచ్ పెద్దపీట వేస్తుందనడానికి ఈ ర్యాంకులే ఉదాహరణ అని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్

న్యూస్ బాక్స్

టీచర్ల డుమ్మాపై విచారణ

నారాయణఖేడ్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): 'పాఠశాలకు టీచర్లు డుమ్మా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ఎంఈవో విశ్వనాథ్, కాంప్లెక్స్ హెచ్ఎం పుండ్లిక్‌లు విచారణ జరిపినట్లు తెలిపారు. మండల పరిధిలోని జూక్కల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఈమేరకు విచారణ జరిపామని, నివేదికను డీఈవోకు సమర్పిస్తామని ఎంఈవో తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల తేదీలు ఖరారు

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 26వ తేదీవరకు జరగనున్నాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా వచ్చేనెల 26వ తేదీ నుంచి మే 3వ తేదీవరకు ఓపెన్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రాథమిక బోధనాభ్యాసన మేళా

కంది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం బోధనభ్యాసన సామగ్రి మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో జోగప్ప ప్రారంభించారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించి సరళ పదాలు, గుణిత పదాలు, ద్విత్వక్షర పదాలు, కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం మొదలగు అంశాలపైన వివిధరకాల బోధనాభ్యాసన సామగ్రి ప్రదర్శించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

జిన్నారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సిబ్బంది పనిచేయాలని ఏడీఈ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని దాదిగూడెం, జంగంపేట గ్రామాల పరిధిలోని రైతులతో విద్యుత్ అధికారులు కలిసి విద్యుత్ సరఫరాపై సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'పిల్లలను చదివించాలి'

నారాయణఖేడ్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విధిగా చదివించాలని ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఏ.ఖాదర్ కోరారు. గురువారం ఖేడ్‌లో ప్రవేశాల ప్రచారంలో భాగంగా స్థానిక ముస్లిం యాక్షన్ కమిటీ బాధ్యులతో సమావేశమై మాట్లాడారు. విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు.

'నిధులు కేటాయించాలి'

నారాయణఖేడ్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): ఖేడ్ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ అన్నారు. గురువారం ఖేడ్ పట్టణంలోని ఐబీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.




ఖేడ్‌లో రంగుల దుకాణం, సిద్ధంగా ఉన్న గన్నులు, రంగులు సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న వివిధ రంగులు

ఆడేద్దామా.. హోలీ

- వెలసిన రంగుల దుకాణాలు

నారాయణఖేడ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ వచ్చిందంటే చిన్నా.. పెద్దా తేడా లేకుండా రంగుల్లో మునిగితేలుతారు. రసాయనాలతో తయారు చేసిన రంగులు అనారోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో హెర్బల్ రంగంలో మార్కెట్‌లోకి వచ్చేశాయి. నారాయణఖేడ్‌లో ఈ మేరకు దుకాణాలు వెలిశాయి. హెర్బల్ రంగుల ప్యాకెట్ ఒకటి రూ. 10 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. రంగులు చల్లుకోవడానికి వివిధ రూపాల్లో గన్నులు (చిత్తన గొయ్యలు) విక్రయిస్తున్నారు. ప్రధాని మోదీతో సహా వివిధ కార్టున్ల బొమ్మలు ఉన్న రంగులు చల్లుకునే గన్నులను కొనుగోలు చేసేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

సంగారెడ్డిలో హోలీ సందడి

సంగారెడ్డి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో హోలీ పండుగ సందడి నెలకొన్నది. సంగారెడ్డిలోని పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డుమీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా చిరువ్యాపారులు రంగులు విక్రయించే దుకాణాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. హోలీ రోజు రంగులు చల్లేందుకు చిన్నారులు వివిధరకాల రంగులు, గన్ను, వివిధ పరికరాలు కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు.

ఘనంగా హోలీ సంబరాలు

కల్హేర్/మునిపల్లి/చిన్నశంకరంపేట/రేగోడు/నర్సాపూర్/శివ్వంపేట/వెల్దుర్తి/తూప్రాన్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రమైన కల్హేర్‌తో పాటు మండల పరిధిలోని మాసాన్‌పల్లి, బీబీపేట్, సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్, గోసాయిపల్లి తదితర గ్రామాల్లో గురువారం హోలీ పండుగను జరుపుకున్నారు. బుధవారం రాత్రి చతుర్థి కామ దహనం జరిగిన గ్రామాల్లో గురువారం పండుగ జరుపుకున్నారు. మండల కేంద్రమైన మునిపల్లిలో యువకులు ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు చందాపూర్, జంగరాయి తదితర పాఠశాలల్లో, మండల కేంద్రం రేగోడులో, నర్సాపూర్ పట్టణంలోని పలువార్డుల్లో, శివ్వంపేట మండల పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీ, ఎమ్మెల్యే స్వగ్రామం గోమారం, కొంతాన్‌పల్లిలో, వెల్దుర్తి మండలవ్యాప్తంగా, తూప్రాన్ పట్టణం, మండలంలోని యావాపూర్‌లో గురువారం హోలీ జరుపుకున్నారు.



శివ్వంపేట: కొంతాన్‌పల్లి హోలీ సంబరాల్లో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి

'తీపి' కబురు!

5వ పేజీ తరువాయి

రూ.150 కోట్లు ఖర్చవుతుందని అంచనాకు వచ్చినట్లు సమాచారం. త్వరలోనే మరోసారి సమావేశం కావాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిసింది.

దశాబ్దాలుగా ఎదురుచూపులు

51 శాతం ప్రభుత్వం, 49 ప్రవేటు భాగస్వామ్యంతో నిజాం డెక్కన్ షుగర్స్ పేరిట కొనసాగుతున్న ఈ ఫ్యాక్టరీ 2015 డిసెంబరులో మూతపడింది. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత కంపెనీని నడపలేమని నిశ్చయించి మూసేసింది. వందలాది కార్మికులు ఉపాధిని కోల్పోయి వీధినపడ్డారు. అప్పట్లో మంబోజీపల్లిలోని నిజాం డెక్కన్ షుగర్స్ పరిశ్రమ ఎదుట కార్మికులు సంవత్సరం పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. అప్పటి టీడీఎల్పీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గేట్ మీటింగ్‌లో పాల్గొని కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. మొన్నటి శాసనసభ ఎన్నికల ప్రచారసభలో మెదక్‌లో మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించి కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు స్థానికంగా చక్కెర కర్మాగారం లేకపోవడంతో రైతులు చెరకు పంటను సాగుచేయడం మానేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో మరోసారి రైతులు, కార్మికుల్లో ఆశ చిగురించింది. హామీ ఇచ్చినట్లే ఈ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి, కార్యాచరణ ప్రారంభించడంతో త్వరలోనే ఫ్యాక్టరీ తెరుచుకుంటుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం



మూత పడిన నిజాం దక్కన్ షుగర్స్ కర్మాగారం పునరుద్ధరణకు కార్యచరణ సిద్ధం చేస్తున్నాం. ఈ విషయంలో పునరుద్ధరణ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమైంది. కర్మాగారాలను తెరిపించే విషయంలో విధివిధానాలు ఖరారు చేస్తున్నాం. త్వరలోనే కర్మాగారం పునప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

\- మైనంపల్లి రోహిత్, మెదక్ ఎమ్మెల్యే

సర్కారు బడి పిల్లలకు 'ఏఐ' బోధన

- జిల్లాలో 31 పాఠశాలలు ఎంపిక
- రేపటి నుంచి అమలుకు విద్యాశాఖ చర్యలు



ఏఐ బోధన పొందుతున్న విద్యార్థులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడి పిల్లలకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-కృత్రిమమేధ) సాంకేతిక సాయంతో బోధన అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యాశాఖ సంగారెడ్డి జిల్లాను తాజాగా ఎంపికచేసింది. జిల్లాలోని 31 పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి ఏఐ బోధనను అమలు చేయనున్నారు. ఇప్పటికే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇచ్చారు.

ఏఐ బోధన ఇలా

సాధారణంగా ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడడం లేదు. పలురకాల కార్యక్రమాలు అమలుచేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ సాయంతో 3,4,5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాల కోసం చర్యలు తీసుకుంటారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో బడి పిల్లలను ఆకట్టుకునేలా ఏఐ బోధన అందిస్తారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో 3 నుంచి 5 తరగతులు వారికి తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-కృత్రిమమేధ ద్వారా పాఠాలు బోధిస్తారు. విద్యార్థి అర్థం చేసుకుంటున్నాడా, లేదా అని ఏఐ గుర్తించి అర్థం కాకపోతే సరళమైన మార్గంలో... అయ్యిందంటే మరికొంత మెరుగైన పద్ధతిలో బోధన అందిస్తారు. ఏఐ బోధన కోసం ఆ పాఠశాలల్లో లేదా పక్కనున్న ఉన్నత పాఠశాలల కంప్యూటర్లు ఉపయోగిస్తారు. ఏఐ బోధనతో ప్రాథమిక విద్య బలోపేతంతో పాటు విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

చెక్‌డ్యామ్ నిర్మాణంతో రైతులకు మేలు



చెక్‌డ్యామ్‌ను ప్రారంభిస్తున్న రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి

వెల్దుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చెక్‌డ్యామ్ నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సెహగల్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో వెల్దుర్తి మండల పరిధిలోని మానేపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను గురువారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో సెహగల్ సంస్థ సేవలు విస్తరించాలని వారు కోరారు. చెక్ డ్యాం నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై మాట తప్పిన కాంగ్రెస్ : భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు మాట తప్పుతున్నారని, స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో తాము అధికారంలో ఉన్న సమయంలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకువస్తే, అప్పట్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కలు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా డబ్బులు తీసుకోమని చెప్పి, ప్రస్తుతం తిరిగి ఎల్ఆర్ఎస్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తమ తీరును మార్చుకోకుంటే ప్రజలు తగు విధంగా గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ సర్పంచు వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు సిద్దు, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడానికి శిక్షణ

- రిసోర్స్ పర్సన్, వాలంటీర్లను గుర్తించాలి
- అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలకు సమర్థవంతంగా ఎదుర్కొవడానికి వివిధ శాఖల సమన్వయంతో శిక్షణ కోసం రిసోర్స్‌పర్సన్, వాలంటీర్లను గుర్తించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో ఆపదమిత్ర పథకం అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారత ప్రభుత్వం విపత్తు ప్రమాద తగ్గింపు, విపత్తు నిర్వహణ వ్యవస్థపై దృష్టి సారించడంతో పాటు విద్య సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, సాంకేతిక పురోగతిని ఉపయోగించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తులను ఎదుర్కొవడానికి ముందుకు వచ్చిందన్నారు. జిల్లాలోని 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగి ఆసక్తి ఉన్న యువతీ యువకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఎక్స్ సర్వీమెన్, సివిల్ డిఫెన్స్ ఉద్యోగులు, మహిళా సంఘాల వారు రిసోర్స్ పర్సన్, వాలంటీర్లను జిల్లా నుంచి 200 మందిని ఎంపిక చేయాలన్నారు. ఎంపిక చేసిన వారికి రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి మెదక్ టీఎన్జీవో భవన్, మహిళా డిగ్రీ కళాశాలలో శిక్షణ నిర్వహించాలన్నారు. శిక్షణ సమయంలో వాలంటీర్లకు ఉచిత భోజన సదుపాయం, వసతిని కల్పించాలన్నారు. 20 నుంచి 31 వరకు 12 రోజులపాటు ఉయదం 10:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కొనసాగుతోందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిరా, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు చదువు ముఖ్యం

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



సంగారెడ్డి అర్బన్ : డా.శిల్పను సత్కరిస్తున్న వాసవీ క్లబ్స్ మహిళా సభ్యులు

మెదక్ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారతకు చదువు చాలా ముఖ్యంమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేట్ కట్ చేసి ఉమెన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు మగ పిల్లల్లాగే ఆడపిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలన్నారు.

వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో...

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి శివారులోని వాసవీ మాతా ఆలయంలో పలువురు మహిళలను క్లబ్ సభ్యులు జ్ఞాపిక ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ ప్రదీప్, వనితా క్లబ్స్ జిల్లా కో ఆర్డినేటర్ జ్యోతి, సభ్యులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి'

మునిపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ సీ.అంజిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో గురువారం తన నివాసంలో బీజేపీ మునిపల్లి మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పేరుకే ఆదర్శ పాఠశాల

- అన్నం తినేది ఆరు బయటే..!



చెట్ల కింద భోజనం చేస్తున్న విద్యార్థులు

మునిపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రతి మండలంలో ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేసింది. కానీ మునిపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలలో భోజనం చేసేందుకు డైనింగ్‌హాల్ నిర్మించలేదు. దీంతో విద్యార్థులు గురువారం చెట్లకిందనే భోజనం చేస్తున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. మండల, జిల్లా అధికారులు స్పందించి డైనింగ్‌హాల్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

సివిల్ సర్వీసెస్‌తోనే సామాజిక సేవ

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సర్వీసెస్‌తోనే సామాజిక సేవ సాధ్యమవుతుందని 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సామాజికశాస్త్రాల సహకారంతో 'హౌ టు క్రాక్ ఐఏఎస్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల పాల్గొన్నారు.

కాలనీల్లో దోమల నివారణకు చర్యలు

రామచంద్రాపురం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వరద కాలువ పరీవాహక ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్ కాలనీ వరద కాలువలో ఆయిల్‌బాల్స్ వదిలారు. ఈ కార్యక్రమంలో ఏఈ తిరుపతయ్య, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘునామిరెడ్డి, సత్యనారాయణ, కాశీనాథ్, బలరాం పాల్గొన్నారు.

'అభివృద్ధికి సహకారం అందించాలి'

రామచంద్రాపురం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు గురువారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పూరి గుడిసె దగ్ధం

మెదక్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామం దళితవాడలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ముత్తిగళ్ల బాబు కుటుంబసభ్యులతో కలిసి రాత్రి భోజనం చేసి నిద్రించారు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం ఏర్పడి మంటలు చెలరేగడంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కలవారు మంటలను చల్లార్చేందుకు ప్రయత్నించినా.. అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి అనురాధ వివరాలు సేకరించారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ సూచించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల యజమానులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, నేరమని స్పష్టం చేశారు. జిల్లా హెచ్ఈఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధచట్టం గురించి వివరించారు. బేటీ బచావో-బేటి పడావో కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటు తగదు: మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయం లేకుండా జీవోలు తెచ్చి నల్లవల్లి ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న దీక్షలో పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. డంపింగ్ యార్డు వద్దంటూ సమీప గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నా.. ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం విచాకరమన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయం తీసుకుని నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు గోడ రాజేందర్, సుబ్రహ్మణ్యం, పెద్ద రమేష్ గౌడ్, దిగంబర్, గుండం శంకర్, బాలరాజు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 421 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఫస్టియర్ గణితం-1బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 16,290 మందికి 15,869 మంది హాజరుకాగా, 421 మంది గైర్హాజరయ్యారు. 97.42 హాజరుశాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద రామ్ తెలిపారు. కాగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల, పటేల్‌గూడలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల, ఆర్సీపురం ప్రభుత్వ కళాశాల, ఎంపీసీఆర్ హైస్కూల్ కేంద్రాలను తనిఖీ చేశారు.

జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధులు దూరం

- జీజీహెచ్ ఆర్ఎంవో డా.రవికుమార్

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధులు దూరం అవుతాయని సంగారెడ్డిలోని జీజీహెచ్ ఆర్ఎంవో డా.రవికుమార్ తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి మాట్లాడారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు హిమగిరిప్రసాద్, రాజు, డయాలసిస్ టెక్నీషియన్ రవి, రాజేశ్, సంపత్, విఘ్నేష్ పాల్గొన్నారు.

మీ కిడ్నీలను రక్షించుకోండి



డాక్టర్ ఆనంద్

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి(సీకేడీ), రేనల్ స్టోన్స్(కిడ్నీ రాళ్లు) నివారణకు ముందు జాగ్రత్తలు తప్పనిసరి అని కన్సల్టెంట్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డా.ఆనంద్ తెలిపారు. ప్రపంచ మూత్రపిండ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని అనూష సూపర్ స్పెషాలిటీ క్లినిక్ వైద్యులు గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీకేడీ, కిడ్నీ రాళ్ల నివారణకు మరిగించిన నీళ్లను తాగాలని, రోజుకు 2-3 లీటర్ల నీరు తాగడం వల్ల టాక్సిన్స్ బయటకు వెళ్లిపోతాయని, కిడ్నీ రాళ్ల ఏర్పాటును అడ్డుకుంటాయన్నారు. అధికంగా నొప్పి నివారణ మాత్రలు వాడరాదని, నాన్ స్టెరాయిడల్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ ఎక్కువ కాలం వాడటం కిడ్నీలకు హాని కలిగిస్తాయని పేర్కొన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడం, సమయానికి రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీ వ్యాధుల భారాన్ని తగ్గించవచ్చని డా.ఆనంద్ స్పష్టం చేశారు.

ఘనంగా కేరళ పొంగల్ వేడుక

రామచంద్రాపురం టౌన్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి ఎంఐజి కాలనీలో గురువారం కేరళకు ఉద్యోగులు అట్టుకల్ పొంగల్ పండుగను వైభవంగా నిర్వహించారు. ఏటా మార్చిలో పొంగల్ వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. స్వామికి పొంగల్‌ను నైవేద్యంగా సమర్పించారు. కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి, బిన్నూ పాల్గొన్నారు.



అట్టుకల్ పొంగల్ వేడుకల్లో కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి